# నమస్తే ఉదయం


తెలుగు దినపత్రిక

సంపుటి: 2 | సంచిక: 329 | పేజీలు: 4 | వెల: రూ.4/- | ఆదివారం 6 జులై 2025 | ఎడిటర్: ఎం.వనితా రెడ్డి


## జనగణనకు నోటిఫికేషన్ విడుదల

హైదరాబాద్, జులై 5 (నమస్తే ఉదయం)

జనగణన–2027కు సం బంధించిన నోటిఫికేషన్‌ను రాష్ట్ర ప్రభు త్వం విడుదల చేసింది. సీఎస్ కే రామకృష్ణారావు జీవో 142ను శనివారం జారీచేశారు. తెలంగాణ ప్రభుత్వం జనగణన–2027కు సంబంధించి కేంద్ర ప్రభుత్వ ప్రకటనను రాష్ట్ర గెజిట్‌లో ప్రచురించనున్నది. భారత జనగణన చట్టం 1948 సెక్షన్ 3 కింద 2027 మార్చి 1 అర్ధరాత్రి 12:00 గంటలకు దేశవ్యాప్తంగా జనగణన నిర్వహించనున్నట్టు కేంద్రం ప్రకటించింది.





### రేవంత్ రెడ్డికి
## కేటీఆర్ సవాల్

72 గంటల్లో రా.. తేల్చుకుందాం..

వ్యవసాయంపై ఎక్కడ చర్చ పెట్టినా సిద్ధమే

సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఈనెల 8న సిద్ధంగా ఉంటా

ఎవరు రైతులకు మేలు చేశారో... చేయలేదో తేలుస్తాం

ఈ చర్చకు కేసీఆర్ అవసరం లేదు... నేను చాలు

మీడియా సమావేశంలో రేవంత్‌కు కెటిఆర్ ప్రతిసవాల్

హైదరాబాద్, జులై 5 (నమస్తే ఉదయం)

వ్యవసాయంపై ఎక్కడ చర్చ పెట్టినా రావడానికి సిద్ధమని బిఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ స్పష్టం చేశారు. తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో పార్టీ నేతలతో కలిసి ఆయన మాట్లాడారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఈనెల 8న సిద్ధంగా ఉంటానని, సీఎం రేవంత్‌రెడ్డి చర్చకు రావాలన్నారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పాలనపై కేటీఆర్ ధ్వజమెత్తారు. రైతుల ..మిగతా 2లో

## నేరస్థులను కఠినంగా శిక్షిస్తాం

చిన్నారులపై లైంగిక దాడుల నివారణపై హైదరాబాద్‌లో సదస్సు సీఎం

నేరస్థులను కఠినంగా శిక్షిస్తామని, ఎవరినీ వదిలిపెట్టమని హెచ్చరిక

భరోసా కేంద్రాల ద్వారా బాధితులకు పూర్తి అండగా నిలుస్తున్నామని వెల్లడి



హైదరాబాద్, జులై 5 (నమస్తే ఉదయం)

చిన్నారులు, మహిళల భద్రతకు తమ ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తోందని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. భరోసా కేంద్రాల ద్వారా బాధితులకు అండగా ఉంటున్నట్లు చెప్పారు. 'లైంగిక దాడుల బాధిత చిన్నారుల రక్షణ, భద్రత' అంశంపై హైదరాబాద్‌లో నిర్వహించిన సదస్సులో ఆయన మాట్లాడారు. చిన్నారులపై లైంగిక హింసను అందరూ ఖండిరచాలన్నారు. ఇలాంటి కేసుల్లో నిందితులను కఠినంగా శిక్షిస్తామని హెచ్చరించారు. సామాజిక మాధ్యమాల విషయంలో ప్రజలు జాగ్రత్తగా ఉండాలని సూచించారు. సదస్సులో సుప్రీంకోర్టు జడ్జి జస్టిస్ సూర్యకాంత్, హైకోర్టు న్యాయమూర్తులు, డీజీపీ జితేందర్, పోలీసు ఉన్నతాధికారులు పాల్గొన్నారు. స్టేట్ లెవెల్ స్టేక్ హోల్డర్స్ కన్సల్టేషన్ విరీట్–2025 కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ మాట్లాడుతూ.. వాయిస్ ఫర్ ది వాయిస్ లెస్ అనే థీమ్ తో.. తమ బాధను చెప్పుకోలేని వారికి రక్షణ కల్పించేందుకు ప్రస్తుత పరిస్థితుల్లో ఇలాంటి రాష్ట్రస్థాయి సమావేశం ఏర్పాటు చేయడం చాలా అవసరం అన్నారు. ఎంతో కీలకమైన అంశంపై సదస్సు నిర్వహిస్తున్న తెలంగాణ పోలీసు, ఇతర నిర్వాహకులను అభినందిస్తున్నా.. ఇలాంటి నేరాలను నియంత్రించడమే కాకుండా ..మిగతా 2లో

## కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేస్తాం

అద్దె బస్సులు అందించిన మహిళా సంఘాలకు చెక్కులు

ఇందిరా మహిళా శక్తి సంబరాల్లో భట్టి

హైదరాబాద్, జులై 5 (నమస్తే ఉదయం)

అవకాశం ఉన్న ప్రతిచోట మహిళలకు ఆర్థిక భరోసా కల్పిస్తామని తెలంగాణ డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. తమ ప్రభుత్వం మహిళా సంఘాలకు అండగా ఉంటుందని చెప్పారు. ప్రజాభవన్‌లో ఇందిరా మహిళా శక్తి సంబరాలు నిర్వహించారు. ఆర్టీసీకి అద్దె బస్సులు అందించిన మహిళా సంఘాలకు చెక్కులు పంపిణీ చేశారు. తొలి నెల అద్దె కింద రూ.1.49 కోట్లు– ఆయా సంఘాలకు.. మంత్రులు భట్టి విక్రమార్క, పొన్నం ప్రభాకర్, సీతక్క అందించారు. ఈ సందర్భంగా భట్టి విక్రమార్క మాట్లాడుతూ.. మహిళలు వ్యాపారవేత్తలుగా రాణించేందుకు ప్రోత్సహిస్తున్నామన్నారు. కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయాలనే లక్ష్యంతో ముందుకెళ్తున్నట్లు చెప్పారు. ఐదేళ్లలో వారికి రూ.లక్ష కోట్ల రుణాలు ఇవ్వాలనేది లక్ష్యమన్నారు. ఈ నెల 8న అన్ని మండలాల్లో ప్రభుత్వ కార్యక్రమాలపై చర్చించాలి. మహిళలకు ప్రభుత్వం కల్పిస్తున్న లబ్ధి గురించి చర్చించాలి. గ్రామాలు, మండలాల్లో మహిళా సమాఖ్య సమావేశాలు ఏర్పాటు– చేయాలి. ఈనెల 10 నుంచి 16 వరకు అసెంబ్లీ నియోజకవర్గాల్లో సమావేశాలు ఉంటాయి. వడ్డీ లేని రుణాల నగదును చెక్కుల రూపంలో అందిస్తాం. ప్రభుత్వం అందిస్తున్న ఆర్థిక సాయంపై ప్రజలకు వివరించాలని భట్టి విక్రమార్క తెలిపారు.





## జూరాలకు కొనసాగుతున్న వరద

గద్వాల జిల్లా ప్రతినిధి, జూలై5(నమస్తే ఉదయం)కర్ణాటక జలాశయాల నుంచి జూరాల ప్రాజెక్టు జలాశయంలోకి శనివారం సాయంత్రం 1,20,000 క్యూసెక్కుల వరద చేరుతోంది. దీంతో డ్యాం అధికారులు 14 గేట్లను ఎత్తి దిగువకు నీటిని విడుదల చేశారు. స్పిల్‌వే ద్వారా 92,890 క్యూసెక్కులు బయటకు వెళ్తుండగా, విద్యుత్ ఉత్పత్తి ద్వారా 28,571 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. మొత్తంగా 1,24,710 క్యూసెక్కుల వరద బయటకు వెళ్తున్నది.కాగా, జూరాల డ్యామ్ పూర్తిస్థాయి నీటిమట్టం 318.518 మీటర్లు ఉండగా.. ప్రస్తుతం నీటిమట్టం 317.390 మీటర్ల వద్ద ఉన్నది. మొత్తం నీటినిల్వ సామర్థ్యం 9.657 టీఎంసీలకుగాను ఇప్పుడు 7.444టీఎంసీలు ఉన్నాయి.

### అధ్యక్ష బాధ్యతలు స్వీకరించిన
## రామచంద్రరావు

బిజెపి విధానాలు నచ్చని వారు పార్టీని వీడినా నష్టం లేదు

గజమాలతో సత్కరించిన బిజెపి అగ్రనేతలు

మీడియా సమావేశంలో కొత్త అధ్యక్షుడి స్పష్టీకరణ




హైదరాబాద్, జులై 5 (నమస్తే ఉదయం)

భాజపా తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడిగా ఎన్.రామచందర్‌రావు శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా కాషాయ నేతలు ఆయన్ను గజమాలతో సత్కరించారు. హైదరాబాద్ నాంపల్లిలోని బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యాలయంలో రాష్ట్ర అధ్యక్ష బాధ్యతలను రామచందర్ రావుకు కిషన్ రెడ్డి అప్పగించారు. ఈ సందర్భంగా కొత్త అధ్యక్షుడికి బీజేపీ శ్రేణులు అభినందనలు తెలిపారు. బాధ్యతల స్వీకరణ అనంతరం రామచందర్ రావు మీడియాతో మాట్లాడుతూ.. ..మిగతా 2లో



### ఆస్పత్రి నుంచి
## కేసీఆర్ డిశ్చార్జ్

హైదరాబాద్, జులై 5 (నమస్తే ఉదయం)

ముఖ్యమంత్రి, భారత రాష్ట్ర సమితి అధినేత కేసీఆర్ సోమాజిగూడ యశోద ఆసుపత్రి నుంచి డిశ్చార్జి అయ్యారు. సాధారణ ఆరోగ్య పరీక్షల్లో భాగంగా ఆయన గురువారం ఆసుపత్రిలో చేరారు. బ్లడ్ షుగర్, సోడియం స్థాయిలు మానిటర్ చేయడానికి ఆసుపత్రిలో చేరాల్సిందిగా వైద్యులు సూచించారు. దీంతో ఆయన రెండు రోజులు అక్కడే ఉండి చికిత్స పొందారు. ప్రస్తుతం కేసీఆర్ ఆరోగ్య పరిస్థితి మెరుగుపడటంతో శనివారం ఉదయం ఆసుపత్రి నుంచి డిశ్చార్జి అయి నందినగర్‌లోని నివాసానికి వెళ్లారు.

# ఆదాయ సమానత్వంలో భారత్ సత్తా

న్యూఢిల్లీ, జులై 5 (నమస్తే ఉదయం)

ఆదాయ సమానత్వం విషయంలో భారతదేశం ప్రపంచంలోనే ఒక ఆదర్శవంతమైన దేశంగా నిలుస్తోంది. ప్రపంచ బ్యాంకు విడుదల చేసిన తాజా గణాంకాల ప్రకారం, ఆదాయ పంపిణీలో అసమానతలను కొలిచే 'గిని సూచీ'లో భారత్ అద్భుతమైన ప్రగతి సాధించి, ప్రపంచంలోనే 4వ స్థానంలో నిలిచింది. స్లోవాక్ రిపబ్లిక్, స్లోవేనియా, బెలారస్ మాత్రమే భారత్ కంటే ముందున్నాయి. అమెరికా, చైనాతో పాటు జీ7, జీ20 కూటమిలోని అన్ని అగ్ర దేశాలను భారత్ వెనక్కి నెట్టడం విశేషం.ప్రపంచ బ్యాంకు నివేదిక ప్రకారం, భారత్ 'గిని సూచీ' స్కోరు 25.5గా నమోదైంది. ఇదే సమయంలో చైనా (35.7), అమెరికా (41.8) వంటి దేశాలు భారత్ కంటే చాలా వెనుకబడి ఉన్నాయి. 2011లో 28.8గా ఉన్న 'గిని' స్కోరు ఇప్పుడు గణనీయంగా మెరుగుపడటం, దేశ ఆర్థిక ప్రగతి ఫలాలు ప్రజలందరికీ సమానంగా అందుతున్నాయనడానికి నిదర్శనమని సాంఘిక సంక్షేమ శాఖ ఒక ప్రకటనలో పేర్కొంది.

ఈ ఘనత వెనుక దేశంలో పేదరికాన్ని తగ్గించేందుకు ప్రభుత్వం తీసుకుంటున్న స్థిరమైన విధానాలే ప్రధాన కారణమని ప్రపంచ బ్యాంకు తన నివేదికలో స్పష్టం చేసింది. 2011 నుంచి 2023 మధ్య కాలంలో దేశంలో సుమారు 17.1 కోట్ల మంది తీవ్ర పేదరికం నుంచి బయటపడ్డారని తెలిపింది. ఇదే సమయంలో, రోజుకు 2.15 డాలర్ల ఆదాయాన్ని ప్రామాణికంగా తీసుకుంటే, దేశంలో పేదరికపు రేటు 16.2 శాతం నుంచి కేవలం 2.3 శాతానికి పడిపోయింది.

ప్రధాన మంత్రి జన్ ధన్ యోజన ద్వారా 55 కోట్లకు పైగా బ్యాంకు ఖాతాలు తెరవడం, ఆధార్ ద్వారా 142 కోట్ల మందికి ప్రత్యక్ష నగదు బదిలీ (డీబీటీ) సేవలు అందించడం వంటి కార్యక్రమాలు ఈ మార్పునకు దోహదపడ్డాయి. డీబీటీ ద్వారా మార్చి 2023 నాటికి రూ.3.48 లక్షల కోట్లు ఆదా అయినట్లు నివేదిక వెల్లడించింది. వీటితో పాటు, ఆయుష్మాన్ భారత్ కింద 41 కోట్ల మందికి ఆరోగ్య రక్షణ, పీఎం గరీబ్ కల్యాణ్ అన్న యోజన ద్వారా 80 కోట్ల మందికి ఆహార భద్రత కల్పించడం వంటి పథకాలు కూడా ఆదాయ సమానత్వాన్ని పెంచడంలో కీలక పాత్ర పోషించాయి.



# హిమాచల్ అతలాకుతలం

సిమ్లా: జులై 5 (నమస్తే ఉదయం)

హిమాచల్ ప్రదేశ్‌లో రుతుపవనాలు బీభత్సం సృష్టిస్తున్నాయి. వీటి ప్రభావంతో కురుస్తున్న కుండపోత వర్షాలతో హిమాచల్ ప్రాంతంలో జనజీవనం అస్తవ్యస్తంగా మారింది. నదులు పొంగి ప్రవహిస్తున్నాయి. కొండచరియలు విరిగి పడుతున్నారు. ఇప్పటివరకూ 72 మంది మృతి చెందారు. 40 మంది గల్లంతయ్యారు. ఎడతెరిపి లేకుండా భారీగా కురుస్తున్న వర్షాల కారణంగా 500కి పైగా రోడ్లు పూర్తిగా దెబ్బతిన్నాయి. రాష్ట్రంలో వరద సహాయక చర్యలు ముమ్మరం కొనసాగుతున్నాయి. 7 వరకు భారీ వర్షాలు కొనసాగుతాయని అంచనా నేపథ్యంలో అధికారులు అప్రమత్తంగా ఉన్నారు. ఈ ఏడాది భారీ వర్షాలతో హిమాచల్ ప్రదేశ్ అతలాకుతలమవుతోంది. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో రాష్ట్రవ్యాప్తంగా ఆకస్మిక వరదలు, భారీగా కొండచరియలు విరిగిపడ్డాయి. జూన్ 20న రుతుపవనాలు ప్రారంభమైనప్పటి నుండి కనీసం 72 మంది ప్రాణాలు కోల్పోయారని, 40 మంది గల్లంతయ్యారని, 100 మందికి పైగా గాయపడ్డారని ముఖ్యమంత్రి సుఖ్వీందర్ సింగ్ సుఖు నివేదించారు. రాష్ట్రంలో 14 ప్రాంతాల్లో భారీ వర్షాలు సంభవించాయని, మౌలిక సదుపాయాలను తీవ్రంగా దెబ్బతీశాయని ముఖ్యమంత్రి సుఖు చెప్పారు. రాష్ట్ర అత్యవసర ఆపరేషన్ సెంటర్ ప్రాథమిక అంచనాల ప్రకారం, భారీ వర్షాల వల్ల కలిగిన నష్టం రూ.541 కోట్లుగా అంచనా వేయగా, వాస్తవ నష్టాలు రూ.700 కోట్లకు దగ్గరగా ఉండవచ్చని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. నష్టానికి సంబంధించి ఇంకా నివేదికలు వస్తున్నాయి. అనేక భవనాలు, రోడ్లు, వంతెనలు కొట్టుకుపోయాయి. కాంగ్రా, సిర్మౌర్, మండి జిల్లాల్లో ఆదివారం అతి భారీ నుండి అతి భారీ వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉందని స్థానిక వాతావరణ శాఖ రెడ్ అలర్ట్ జారీ చేసింది. ఇక ఇవాళ, సోమ, మంగళవారాల్లో ఉనా, బిలాస్‌పూర్, హమీర్‌పూర్, చంబా, సోలన్, సిమ్లా, కులు జిల్లాలకు కూడా ఆరంజ్ అలర్ట్స్ జారీ చేశారు. ఆరంజ్ అలర్ట్ తీవ్రమైన వాతావరణ ముప్పును సూచిస్తుంది. జిల్లాల వారీగా మృతుల సంఖ్య వివరాలు చూస్తే, మండిలో డజనుకు పైగా చనిపోగా, 40 మంది తప్పిపోయినట్లు- సమాచారం. కాంగ్రా జిల్లాలో 13 మంది మరణించారు. చంబా జిల్లాలో 6 గురు, సిమ్లా జిల్లాలో 5 మంది, బిలాస్‌పూర్, హమీర్‌పూర్, కిన్నౌర్, కులు, లాహౌల్ స్పితి, సిర్మౌర్, సోలన్, ఉనాలో కూడా మరణాలు సంభవించాయి. ఇప్పటికే పలు మార్లు రెడ్, ఆరంజ్ రెయిన్ అలర్ట్స్ జారీ చేశారు.



# దివ్యాంగులను చిన్నచూపు చూడొద్దు

## జూనియర్ సివిల్ జడ్జి శిరీష

కొత్తకోట, జూలై 5(నమస్తే ఉదయం)సమాజంలో మానసిక దివ్యంగులను చిన్నచూపు చూడొద్దని ఆత్మకూర్ జూనియర్ సివిల్ జడ్జి శిరీష సూచించారు.శనివారం కొత్తకోట మున్సిపాలిటీ కేంద్రంలోని వికలాంగుల పునరావాస కేంద్రాన్ని ఆమె సందర్శించి వికలాంగుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాలలో ఆకతాయిలు వికలాంగులను ఆటపట్టించి హేళన చేయడం అలాంటి పనులు చేయరాదని,అలాంటి వారిపై చట్ట రీత్య చర్యలు తీసుకోబడతాయని హెచ్చరించారు.సమాజంలో మానసిక వికలాంగులనుగౌరవించుకోవాలన్నారు

### విద్యార్థులు ర్యాగింగ్‌కు పాల్పడవదు

కొత్తకోట మండల కేంద్రంలోని బాలికల గురుకుల పాఠశాలలో పదవ తరగతి, ఇంటర్మీడియట్, విద్యార్థులకు న్యాయ విజ్ఞాన సదస్సును నిర్వహించారు. ఈ సదస్సులో సివిల్ జడ్జ్ శిరీష మాట్లాడుతూ సీనియర్ విద్యార్థులు తోటి విద్యార్థుల పట్ల ర్యాగింగ్ కు పాల్పడవద్దని బాల్యవివాహాలు చేసుకోకూడదన్నారు.ముఖ్యంగా యువత మత్తుకు బానిసలై చదువు పట్ల నిర్లక్ష్యం చేస్తూ మీ బంగారు భవిష్యత్తును నాశనం చేసుకోరాదని భవిష్యత్తులో మంచిగా చదువుకొని ఉన్నతంగా ఎదగాలని సూచించారు.ఈ కార్యక్రమం లో అసిస్టెంట్ ప్రాజెక్టు మేనేజర్ ఎస్ శ్రీనివాసులు, ఫీల్డ్ అసిస్టెంట్ లక్ష్మన్న, లోకల్ అదాలత్ సిబ్బంది స్వప్న, విద్యావతి, సి డి డబ్ల్యూ బాలనాగమ్మ,ఉమాదేవి, జములమ్మ, లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్ర బిజెపి నూతన అధ్యక్షులు రామచంద్రరావుకు శుభాకాంక్షలు తెలిపిన బిజెపి రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి వై శ్రీధర్

రాజేంద్రనగర్, జూలై 5(నమస్తే ఉదయం) తెలంగాణ రాష్ట్ర భారతీయ జనతా పార్టీ నూతన అధ్యక్షులుగా నియమితులైన రామచంద్ర రావు పాతబస్తీ చార్మినార్ వద్ద భాగ్య లక్ష్మి దేవాలయాన్ని దర్శించుకున్నారు. అనంతరం తెలంగాణ అమరవీరుల స్తూపం గన్ పార్క్ వద్దనుండి ర్యాలీగా బయలుదేరి రాష్ట్ర బిజెపి అధ్యక్షుడిగా పదవి బాధ్యతలు చేపట్టిన ఎన్ రామచంద్ర రావు కు బిజెపి రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి వై శ్రీధర్ సన్మానం చేశారు.



రామచంద్ర రావు సన్మానిస్తున్న వై శ్రీధర్

# నకిలీ హెల్మెట్లపై కేంద్రం ఉక్కుపాదం

న్యూఢిల్లీ, జూలై 5 (నమస్తే ఉదయం)

ద్విచక్ర వాహనదారుల భద్రతను దృష్టిలో ఉంచుకుని కేంద్ర ప్రభుత్వం ఒక కీలక నిర్ణయం తీసుకుంది. దేశవ్యాప్తంగా నాణ్యతా ప్రమాణాలు పాటించకుండా తయారవుతున్న, అమ్ముడవుతున్న హెల్మెట్లపై ఉక్కుపాదం మోపింది. అటువంటి హెల్మెట్లను తయారుచేసే సంస్థలు, విక్రయించే రిటైలర్లపై కఠిన చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వాలను ఆదేశించింది. ఐఎస్ఐ మార్క్ ఉన్న, బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్ (బీఐఎస్) సర్టిఫికేషన్ పొందిన హెల్మెట్లను మాత్రమే వినియోగించాలని ప్రజలకు కేంద్ర వినియోగదారుల వ్యవహారాల శాఖ శనివారం ఒక ప్రకటనలో స్పష్టం చేసింది.దేశంలో 21 కోట్లకు పైగా ద్విచక్ర వాహనాలు ఉన్నాయని, రైడర్ల భద్రత అత్యంత ముఖ్యమని ప్రభుత్వం పేర్కొంది. మోటారు వాహనాల చట్టం-1988 ప్రకారం హెల్మెట్ ధరించడం తప్పనిసరి అని గుర్తుచేసింది. రోడ్ల పక్కన అమ్మే నాణ్యత లేని హెల్మెట్ల వల్ల ప్రమాద సమయంలో ప్రాణాలకు తీవ్ర ముప్పు వాటిల్లుతోందని ఆందోళన వ్యక్తం చేసింది. నాణ్యమైన హెల్మెట్ల వాడకం ద్వారా తలకు తీవ్ర గాయాలయ్యే ప్రమాదాలు తగ్గుతున్నప్పటికీ, ఈ విషయంలో ఇంకా చాలా చేయాల్సి ఉందని నిపుణులు చెబుతున్నారు.హెల్మెట్ల నాణ్యతను నిర్ధారించేందుకు 2021లోనే కేంద్రం ఒక క్వాలిటీ కంట్రోల్ ఆర్డర్‌ను అమల్లోకి తెచ్చింది. దీని ప్రకారం, బీఐఎస్ ప్రమాణాలకు అనుగుణంగా ఉన్న ఐఎస్ఐ మార్క్ హెల్మెట్లను మాత్రమే విక్రయించాలి. ప్రస్తుతం దేశవ్యాప్తంగా 176 సంస్థలకు మాత్రమే నాణ్యమైన హెల్మెట్లు తయారు చేయడానికి బీఐఎస్ లైసెన్సులు ఉన్నాయి.నిబంధనల అమలును పర్యవేక్షించడానికి బీఐఎస్ అధికారులు నిరంతరం ఫ్యాక్టరీలు, మార్కెట్లలో తనిఖీలు నిర్వహిస్తున్నారు. గత ఆర్థిక సంవత్సరంలో 500కు పైగా హెల్మెట్ నమూనాలను పరీక్షించగా, బీఐఎస్ మార్క్‌ను దుర్వినియోగం చేస్తున్న వారిపై 30కి పైగా సోదాలు నిర్వహించి, హెల్మెట్లను స్వాధీనం చేసుకున్నారు. ఒక్క ఢిల్లీలోనే లైసెన్సులు రద్దయిన 9 సంస్థల నుంచి 2,500కు పైగా నాణ్యత లేని హెల్మెట్లను అధికారులు సీజ్ చేశారు. ఈ అంశంపై దేశవ్యాప్తంగా ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి, నిబంధనలు ఉల్లంఘించే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్లు, పోలీసు యంత్రాంగానికి కేంద్రం ఇప్పటికే లేఖలు రాసింది.

# నేరస్థులను కఠినంగా శిక్షిస్తాం

మొదటి పేజీ తరువాయి...

బాల బాధితులకు చట్టపరమైన అన్ని రకాల రక్షణ కల్పించాల్సి ఉంది. ల్యైంగిక వేధింపుల నుంచి అన్ని రకాలుగా రక్షణ కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. మా ప్రభుత్వం పిల్లలు, మహిళల రక్షణకు అత్యంత ప్రాధాన్యత ఇస్తుంది. బాలికల సంరక్షణ కోసం తెలంగాణ భరోసా ప్రాజెక్టును తీసుకొచ్చిందన్నారు. అనుసంధానంగా 29 కేంద్రాలు పనిచేస్తున్నాయి. ఈ కేంద్రాల ద్వారా పోలీసు సహాయమే కాకుండా న్యాయ పరమైన సహాయం, వైద్య సహాయం, కౌన్సెలింగ్ వంటి సేవలను అందిస్తున్నాయి. హైదరాబాద్ కేంద్రంగా పనిచేస్తున్న భరోసా కేంద్రం ద్వారా చైల్డ్ ఫ్రెండ్లీ కోర్టులను ప్రారంభించిన మొదటి రాష్ట్రంగా తెలంగాణ నిలిచింది. కేసులను వేగవంతంగా పరిష్కరించడమే కాకుండా పిల్లలకు సంపూర్ణ రక్షణ, వారిలో విశ్వాసం, అభివృద్ధికి అవసరమైన చర్యలు తీసుకోవడం ఈ కేంద్రాల లక్ష్యం అని వివరించారు. పోక్సో చట్టం, జ్యువెనైల్ చట్టాలు మన ప్రగతిశీల సాధనాలుగా పనిచేస్తున్నాయి. అయితే ఆచరణలో కొన్ని సమస్యలు ఎదురవుతున్నాయి. ఆ చట్టాలు బాధితులకు ఎలాంటి హాని కలిగించకుండా, వారి భవిష్యత్తుకు రక్షణగా సంపూర్ణ సహాయకారిగా ఉండాలి. సోషల్ మీడియా ద్వారా పిల్లలపై జరిగే దురాగతాలు, దుర్వినియోగం చేస్తున్న వారి పట్ల ఎలాంటి కరుణ చూపకుండా దోషుల విషయంలో కఠినంగా వ్యవహరించాలి. ఇందుకు అవసరమైన చర్యలు తీసుకోవడానికి తెలంగాణ ప్రభుత్వం సిద్ధంగా ఉంది.



# రేవంత్ రెడ్డికి కేటీఆర్ సవాల్

మొదటి పేజీ తరువాయి...

బాగుపై కాంగ్రెస్ పార్టీ నేతల మాటలు.. దయ్యాలు వేదాలు వల్లించినట్టుగా ఉందని ఎద్దేవా చేశారు. ఇందిరమ్మ రాజ్యం అంటే ఎరువులు, విత్తనాల కోసం రైతులు క్యూలైన్లలో చెప్పులు పెట్టడమేనా అని ప్రశ్నించారు. కొత్త రాష్ట్రాన్ని కేంద్రం ఇబ్బందులు పెట్టినా కేసీఆర్ నిలబడ్డారని గుర్తు చేశారు. తెలంగాణను కోటి ఎకరాల మాగాణిగా మార్చిన ఘనత కేసీఆర్‌దేనని అన్నారు. నీటికి పల్లం ఎలా తెలుసో తెలంగాణ కు నీరు ఎవరు తీసుకు వచ్చారో అందరికి తెలుసు.. తెలంగాణ లో ఏ రైతును, ఎద్దును అడిగినా వ్యవసాయం పండుగ ఎవరు చేశారో చెప్తారు.. సీఎం నిన్న రంకెలు వేశాడు.. ఆయన సభ పెట్టాడంటే బూతులతోనే మాట్లాడతాడు.. మా పార్టీ తరుపున మీ సవాలు స్వీకరిస్తున్నాం.. ఎక్కడ చర్చ పెట్టినా వస్తాం.. మీకు కేసీఆర్ అవసరం లేదు.. మేము చాలు.. 72 గంటలు ఇస్తున్నాం.. మీరు ప్రిపేర్ అయి రండి.. సీఎంకు బేసిన్ లు తెలియదు బెండకాయలు తెలియదు.. సమైక్య రాష్ట్రంలో నీళ్లు ఇవ్వలేదు కాబట్టే తెలంగాణ ఉద్యమం పుట్టింది..సీఎం రేవంత్ రెడ్డి హయాంలో నీళ్లు ఆంధ్రకు, నిధులు ఢిల్లీకి, నియామకాలు ఆయన అనునాయులకు వచ్చాయని అంటూ విమర్శలు గుప్పించారు. ఇందిరమ్మ రాజ్యం గొప్పతనం తెలియాలి అంటే బట్టలు విప్పి కొడతాం అన్నారు.. బనకచర్ల ద్వారా మీ గురువు చంద్రబాబు తీసుకెళ్తుంటే మీ తీరు తెలంగాణ సమాజం చూస్తూనే ఉంది. బురద జల్లి తప్పించుకునే అలవాటు సీఎం కి ఉంది.. 8 వ తారీఖు 11 గంటలకు సోమజిగూడా ప్రెస్ క్లబ్ కు మేము వస్తాము.. మీరు రండి మీడియా ముందే చర్చిద్దాం.. కేసీఆర్ ప్రభుత్వం నాట్లు వచ్చినప్పుడు రైతు బంధు ఇచ్చేది... ఓట్లు వచ్చేముందు రైతు భరోసా ఇస్తుంది కాంగ్రెస్.. ఇప్పటి వరకు రైతులకు ఎకరానికి 19 వేలు ఎగ్గొట్టారు. అన్నదాతకు సున్నం పెట్టింది కాంగ్రెస్ ప్రభుత్వం.. మందికి పుట్టిన బిడ్డలు నా బిడ్డలు అనడానికి సిగ్గు లేదా.. మేము ఇచ్చిన ఉద్యోగాలు మీరు ఇచ్చినట్లు- చెప్పుకుంటున్నారు.. అశోక్ నగర్ లో చర్చకు వస్తావా.. ఈ మూడు రోజులు మీకు టైం ఇస్తున్నాం.. అప్పటివరకు మీరు చెప్పకుంటే.. 8వ తేదీన మేము సోమజిగూడా ప్రెస్‌క్లబ్ లో సిద్ధం గా ఉంటాం.. మీలాగా మందబలంతో కాకుండా 10,15 మందితో వస్తాం.. ఈయన ఇచ్చే డబ్బులతో ఢిల్లీ టకీ టకీ అని మోగుతున్నాయి.. కాంగ్రెస్ ఎమ్మెల్యే చెప్పినట్లు- చంద్రబాబు కోవర్ట్ రేవంత్ రెడ్డినే.. ఆ ఎమ్మెల్యే చాలా కరెక్టు గా చెప్పాడు.. అలా చెప్పిన ఎమ్మెల్యేను అభినందిస్తున్నాను అని కేటీఆర్ తెలిపారు.

# అధ్యక్ష బాధ్యతలు స్వీకరించిన రామచంద్రరావు

మొదటి పేజీ తరువాయి...

సామాన్య కార్యకర్త స్థాయి నుంచి అధ్యక్షుడి వరకు రావడం బీజేపీలోనే సాధ్యమని.. ఇందుకు తన ఎన్నికే నిదర్శనమన్నారు. రాష్ట్రంలో బీజేపీ బలోపేతానికి స్పష్టమైన కార్యచరణతో ముందుకెళ్తామని చెప్పారు. రాష్ట్రంలో బీజేపీకి ఒక అవకాశం ఇవ్వాలని ప్రజలను కోరుతామన్నారు. మోసపూరిత హామీలతో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందని విమర్శించారు. కాంగ్రెస్ చేసిన రైతు రుణమాఫీ పూర్తి స్థాయిలో జరగలేదని ఆరోపించారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగోలేదని తెలిసి ఇష్టమొచ్చినట్లు హామీలు ఎందుకు ఇచ్చారని ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి రైతులు ఉసురు తగులుతుందన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల కోసమే రైతు భరోసా ఇచ్చారని ఆరోపించారు. రాష్ట్రంలో యూరియా కొరతపై దుష్ప్రచారం చేస్తున్నారని ఫైర్ అయ్యారు. ఈ అంశంలో రాష్ట్ర ప్రభుత్వం రైతులను తప్పుదోవ పట్టిస్తుందని మండిపడ్డారు. కేంద్రం ఇచ్చిన యూరియాను రాష్ట్ర పాలకులు తినేశారా అని ఆరోపించారు. మోడీ, బీజేపీని తిట్టడమే కాంగ్రెస్ సామాజిన న్యాయ సభ ఉద్దేశమా అని ప్రశ్నించారు. కార్యక్రమంలో కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, ఎంపీ డీకే అరుణ, పలువురు సీనియర్ నేతలు పాల్గొన్నారు. అంతకుముందు తన నివాసం నుంచి ర్యాలీగా వచ్చిన రామచందర్‌రావు ఉస్మానియా వర్సిటీలోని సరస్వతీ దేవాలయంలో, చార్మినార్ భాగ్యలక్ష్మి అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ బీజేపీ విధానాలు నచ్చనివారు పార్టీని వీడినా నష్టం లేదంటూ వ్యాఖ్యానించారు. బీజేపీ విధానాలు, నిర్ణయాలు నచ్చక ఎవరు పార్టీని వీడినా నష్టం లేదని రామచందర్రావు అన్నారు. పార్టీని నమ్ముకున్నవారిని బీజేపీ ఎప్పుడూ మోసం చేయదని, అందుకు తానే ఉదాహరణ అని చెప్పారు. పార్టీ అభివృద్ధికి పని చేసిన వారందరికీ అవకాశాలు వస్తాయన్నారు. కాంగ్రెస్ పార్టీ దోపిడీకి తెలంగాణ అక్షయ పాత్రగా మారిందని బిజెపి తెలంగాణ అధ్యక్షుడు ఎన్.రాంచందర్ రావు ఆరోపించారు. కర్ణాటక, హిమాచల్ ప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలు కాంగ్రెస్ పార్టీ దోపిడీకి అక్షయపాత్రలుగా మారాయని వ్యాఖ్యానించారు. ఏడాదిన్నర కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో ఒక్క హామీని కూడా సమర్థంగా అమలు చేయలేకపోందని, ప్రజలకు ఏం సమాధానం చెబుతుందని ఆయన నిలదీశారు. కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన సభ సందర్భంగా రామచంద్రరావు స్పందిస్తూ శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. తెలంగాణలో 6 గ్యారంటీ-లు, 13 హామీలు అంటూ భారీగా హడావుడి చేసిన కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటివరకు ఏ హామీని పూర్తిస్థాయిలో అమలు చేయలేకపోయిందని అన్నారు. కులగణన పేరిట బీసీలకు అన్యాయం చేసి, ముస్లింలను బీసీ కోటాలో చేర్చడమే కాంగ్రెస్ సామాజిక న్యాయమా అని ఆయన ప్రశ్నించారు. తెలంగాణ ప్రజలు మళ్లీ మోసపోరని అన్నారు. కాంగ్రెస్ పార్టీ 70 ఏళ్ల పాలనలో వెనుకబడిన వర్గాల వారిని ఎన్నడూ ప్రధానమంత్రి గాని ముఖ్యమంత్రిగా చేయలేద ని విమర్శించారు.



# కాటేస్తున్న (కామం) కన్నపేగు



తేజేశ్వర్ కు పసుపు రుద్దుతున్న ఐశ్వర్య (ఫైల్)
















**క్షణికా వేశమా....?**
**మోజులో పడి మోసపోతున్నారా.....?**

**మంటగలుస్తున్న మానవ సంబంధాలు.**

**రోజుకో దారుణం... ఎటు పోతుంది సభ్య సమాజం.**

**కన్నతండ్రులను చంపిన కుమారులు**

**కన్న కూతురిపై అఘాయిత్యాయత్నం చేసిన తండ్రి.**

**కన్నతల్లిని హత్య చేయించిన కూతురు.**

**కట్టుకున్న భర్తను**
**పారాణి ఆరకముందే కడతేర్చిన భార్య.**

జులై 5, (నమస్తే ఉదయం) తెలంగాణ బ్యూరో. క్షణికావేశమా... కనీస అవగాహన లోపమా...లేక కామంతో కళ్ళు మూసుకుపోయి ఇతరుల మోజుల పడి మోసపోతున్నారా....? తెలియదు గాని రాష్ట్రంలో రోజు కో దారుణమైన సంఘటన వెలుగు చూస్తున్న వైనం చూస్తుంటే అసలు సభ్య సమాజం ఎటువైపు పోతుందో తెలియడం లేదు. అన్న, అక్క, తమ్ముడు చెల్లి, అమ్మానాన్న అనే బంధాలకు మచ్చుకైన విలువ ఉండడం లేదు. వాయు వరుసలు మరచిపోయి ఎవరు ఎవరిపైన అఘాయిత్యానికి పాల్పడుతున్నారో... ఎవరు ఎవరిని ఎందుకు చంపుకుంటున్నారో తెలియని పరిస్థితి దాపురించింది. చిన్నప్పటినుంచి ఎంతో కష్టపడి పెంచి పోషించిన కుమారులే కాలయములై తమ తండ్రులను హత మారుస్తున్నారు. కన్న కూతురిని కంటికి రెప్పలా చూసుకోవలసిన కన్నతండ్రి కూతురిపై అత్యాచారం చేయసాగాడు. ఇదిలా ఉంటే విద్యాబుద్ధులు నేర్చుకోవాల్సిన వయసులో ప్రేమ గీమా.. ఎందుకని మందలించిన పాపానికి తల్లిని కన్న కూతురే ప్రియుడితో హత్య చేయించింది. ఇక సభ్య సమాజం తలదించుకునేలా ప్రియుడు మోజులో పడిన ఓ యువతి అమాయకు ని పెళ్లి చేసుకొని తన సుఖానికి అడ్డు వస్తున్నాడని పెళ్లయి పారాన్ని ఆరకముందే కట్టుకున్న భర్తను హత్య చేయించింది. ఇలా రాష్ట్రంలో గత కొన్ని రోజులుగా జరుగుతున్న ఘటనలు చూస్తుంటే సంస్కృతి సాంప్రదాయాలు కాలగర్భంలో కలిసిపోయి మానవ సంబంధాలకు మచ్చుకైన విలువ ఉండడం లేదు. పెరుగుతున్న నాగరికతతో పాటు పెట్రేగిపోతున్న ( అంతర్జాలం) ఇంటర్నెట్ వ్యవస్థ కారణంగా సమాజం మొత్తం పెడదారి పడుతుంది. అవసరాలకు ఉపయోగపడుతుందన్న ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ ఎంతవరకు ఉపయోగపడుతుందో తెలియదు గాని... అరచేతిలో ఉన్న అంతర్జాలం మాత్రం సులభంగా హత్యలు ఎలా చేయాలో చూపిస్తుంది అనడంలో సందేహం లేదు.

**కన్నతండ్రులను చంపిన కుమారులు... కన్న కూతురిపై అఘాయిత్యాయత్నం చేసిన తండ్రి.**

కన్న తండ్రి..,... కుటుంబ భారం మొత్తం తన భుజాలపై వేసుకొని కన్నవారి కోసం ఎంతో కష్టపడి పెంచి పోషిస్తాడు. ఒక రకంగా చెప్పాలంటే దేవుడు ఎలా ఉంటాడో తెలియదు గానీ కనిపించే ప్రత్యక్ష దైవం కన్నతండ్రి. కానీ నేడు అదే తండ్రి పెంచి పోషించిన కుమారుల చేతనే హత్య కాపాడుతున్నాడు. మరోవైపు కన్నవారిని కంటికి రెప్పలా చూసుకోవాల్సిన కన్న తండ్రి కన్న బిడ్డను కాటేయలని చూస్తున్నారు. ఏమిటి వైపరీత్యాలు ఎందుకు జరుగుతున్నాయి కన్న పేగు పైన అఘాయిత్యాలు అర్థం కావడం లేదు. గత రెండు దశాబ్దాల క్రితం తండ్రి అంటే ఎంతో భయం భక్తి ఉండేది. ఇంటికి పెద్ద దిక్కుగా తండ్రి వ్యవహరిస్తే కుటుంబం మొత్తం మర్యాదగా క్రమశిక్షణతో మెలిగేది. తండ్రి ముందు మాట్లాడడం అటు ఉంచితే కనీసం కూర్చునే వాళ్ళు కాదు కన్న పుత్రులు. తండ్రి మాటలు జవదాటిన ఆనవాలు నూటికి ఏ ఒక్కరిలో ఉండేవి. పెరిగిపోయిన నాగరికత ఫ్రెండ్లీ ఫ్యామిలీ పేరుతో సంస్కృతి సాంప్రదాయాలు, భయం భక్తి మట్టిలో కలిసిపోయాయి నేడు. కన్నవారి పైన కఠినంగా ఎందుకు ఉండాలి అనే చిన్న వెసులుబాటు కన్న తండ్రులను హత మార్చే వరకు నడుస్తుంది నేటి సమాజం. మరోవైపు అక్కడక్కడ కొందరు కీచక తండ్రులు కన్నవారి పైన అఘాయిత్యాలకు పాల్పడడం బాధాకరమైన విషయం. గత నెల రోజులుగా కుటుంబ సభ్యులు ఒకరిపై ఒకరు దాడులకు పాల్పడుతూ మానవ సంబంధాలను మంటగలుపుతూ హత్యలు చేసుకుంటున్నారు. మచ్చుకకు కొన్ని సంఘటనలు.

మహబూబ్నగర్ జిల్లా వనపర్తికి చెందిన హనుమంతు నాయక్ కుటుంబ సభ్యులతో కలిసి నగరంలోని గచ్చిబౌలిలో నివసిస్తున్నాడు. హనుమంతు నాయక్ కి భార్య జములమ్మ, ఇద్దరు కుమారులు రవీందర్, సంతోష్ లు ఉన్నారు. ఇంటర్ పూర్తి చేసి ఖాళీగా ఉన్న రవీందర్ జులాయి తిరుగుడుకి అలవాటు పడి బెట్టింగ్లో డబ్బులు పోగొట్టుకుని అప్పుల పాలయ్యాడు. అయితే కుమారులు ఉన్నత చదువుల కోసం సొంతూరులో తన వ్యవసాయ పొలాన్ని తాకట్టుపెట్టి ఆరు లక్షలు తెచ్చారు. ఇది గమనించిన రవీందర్ బ్యాంకులో వేస్తే డబ్బులు భద్రంగా ఉంటాయని తండ్రి నమ్మించి తన ఖాతాలో వేయించుకొని బెట్టింగ్ లో పోగొట్టుకున్నాడు. డబ్బుల విషయం తండ్రి మందలించగా తన ఫ్రెండ్ కి ఇచ్చానని తన వడ్డీతో సహా ఇస్తాడని నమ్మించాడు. బుధవారం తన ఫ్రెండ్ డబ్బులు ఇస్తున్నాడని గచ్చిబౌలిలోని నిర్మాణస్య ప్రాంతానికి తీసుకెళ్లి తండ్రి నీ కత్తితో పొడిచి హతమార్చాడు.

ఇదిలా ఉంటే సూర్యాపేట జిల్లా మోతే మండలం నాగయ్య గూడెంకు చెందిన వెంకన్నకు ఇద్దరు కుమారులు ఒక కూతురు, గత కొన్ని రోజుల క్రితం అనారోగ్యంతో బార్య మృతి చెందింది. ఇటీవల వెంకన్న తన పేరు మీదున్న మూడెకరాల వ్యవసాయ పొలంలో ఒక ఎకరం కూతురిపై రిజిస్ట్రేషన్ చేయించారు. అవసరాల నిమిత్తం మరో ఎకరం అమ్మకానికి పెట్టాడు. ఇక తనకేమీ మిగలదని తండ్రి పై పగ పెంచుకున్న కుమారుడు గంగయ్య. తండ్రిని ఎలాగైనా హత మార్చాలని పథకం పన్నాడు. పని నిమిత్తం పక్కూరికి వెళ్లిన వెంకన్న తిరిగి వచ్చే సమయంలో గ్రామ సమీపంలో అప్పటికే కాపు కాసిన కుమారుడు గంగయ్య తండ్రి పై గొడ్డలితో విచక్షణ రహితంగా దాడి చేశాడు. దీంతో వెంకన్న అక్కడికక్కడే మృతి చెందాడు.

అల్లారు ముద్దుగా పెంచుకున్న కూతురిపట్ల ఓ తండ్రి ప్రవర్తించిన తీరు చూస్తుంటే అసలు వాయి వరుసలు ఉన్నాయా అని అనిపిస్తుంది. కన్న కూతురిని కంటికి రెప్పలా చూసుకోవాల్సిన కన్న తండ్రి కాటయ్య బోయాడు. ఈ ఘటన నగరంలోని బొల్లారం పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. బొల్లారంలో నివసించే నాగరాజు మద్యానికి బానిసైన ప్రతిరోజు మద్యం మత్తులో భార్యను వేధించసాగాడు. అంతటితో ఆగకుండా కూతురి పట్ల కూడా అమానుషంగా ప్రవర్తించేవాడు. గత వారం రోజుల క్రితం పోటుగా మద్యం తాగిన నాగరాజు కూతురుపై అసభ్యంగా ప్రవర్తించడంతో కూతురు గట్టిగా కేకలు వేసింది ఇది గమనించిన తల్లి నాగరాజు చరనుంచి కూతురుని కాపాడి స్థానిక పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసుకున్న పోలీసులు నాగరాజును అదుపులో తీసుకొని దర్యాప్తు చేపట్టారు.

**కన్నతల్లిని హత్య చేయించిన కూతురు.**

చదువుకునే వయసులో ప్రేమ గీమ ఎందుకని కన్న కూతురిని మందలించిన పాపానికి కన్నతల్లినే ప్రియుడితో కలిసి హత్య చేయించింది ఓ మైనర్ బాలిక. తెలంగాణ ఉద్యమ గాయని అంజలి హత్య రాష్ట్ర మొత్తం పెను సంచలనంగా మారిన విషయం విధితమే. జీడిమెట్ల నివాసం ఉండే అంజలి తన కూతురు ఎనిమిదవ తరగతి లోనే ప్రేమలో పడ్డ విషయాన్ని గమనించి కూతురుని మందలించింది. దీంతో తల్లి పై పగ పెంచుకున్న కూతురు తను ప్రేమించిన నల్గొండకు చెందిన శివతో కలసి అంజలిని హత్య చేయించేందుకు పథకం చేసింది. అనుకున్న విధంగానే గత సోమవారం నల్గొండకు చెందిన శివ అతడి తమ్ముడు యశ్వంత్ తో కలిసి జీడిమెట్ల చేరుకున్నాడు. అప్పటికే పక్క ప్రణాళికతో ఉన్న అంజలి కూతురు ప్రియుడితో కలిసి అంజలి మెడకు చున్ని బిగించి వెనక తెచ్చుకున్న రాడుతో తలపై మోది హత్య చేశారు.

**పెళ్లయి పారాణి ఆరకముందే కట్టుకున్న భర్తను కడతేర్చిన భార్య.**

గద్వాలకు చెందిన ప్రైవేట్ సర్వేయర్ తేజేశ్వర హత్య కేసు రాష్ట్ర మొత్తం సంచలనంగా మారింది. ప్రియుడు మోజుల పడిన ఓ భార్య కట్టుకున్న భర్తను పెళ్లయి పారాని ఆరకముందే ప్రియుడితో కలిసి హత్య చేయించింది. గద్వాలకు చెందిన తేజేశ్వర్ సర్వేయర్ గా పనిచేస్తున్నాను. ఈ క్రమంలో కర్నూలుకు చెందిన సుజాత కూతురు ఐశ్వర్యతో గత కొన్ని రోజుల క్రితం వివాహం జరిగింది. అయితే కర్నూల్ లో బ్యాంకులో మేనేజర్ గా పని చేస్తున్న తిరుమల రావుకు ఐశ్వర్యతో గత కొన్నేళ్లుగా అక్రమ సంబంధం కొనసాగుతుంది. తిరుమల రావు ఐశ్వర్య అక్రమ సంబంధం విషయమై తేజేశ్వర్ కు తెలియడంతో తేజేశ్వర్లును ఎలాగైనా హత్య చేయించాలని తల్లి కూతురు బ్యాంక్ మేనేజర్ పన్నాగం పన్నారు. ఈ క్రమంలోనే కర్నూలుకు చెందిన ఓ సుపారి గ్యాంగ్ కు సుపారిచ్చి తేజేశ్వరరావు హత్య చేసి ఓ కాలువలో పడేశారు. కేసు నమోదు చేసుకున్న గద్వాల పోలీసులు తీగలాగడంతో బ్యాంక్ మేనేజర్ తిరుమలరావు ఐశ్వర్య కలిసి తేజేశ్వర్మ హత్య చేయించినట్లు పోలీసులు తెలిపారు. ముగ్గురిని అదుపులోకి తీసుకున్న పోలీసులు కటకటాల వెనకకు తరలించారు. ఇలా రోజుకో ఘటన ప్రతిరోజు రాష్ట్రంలో ఏదో మూలన చోటు చేసుకోవడం బాధాకరమైన విషయం. పెట్రేగిపోతున్న అశ్లీలతను అరికడితే తప్ప ఇలాంటి ఘోరాలను ఆపలేని పరిస్థితి ప్రస్తుతం దాపురించింది.



## జగన్నాథుడి ఆశీస్సులతో ప్రజలందరూ సంతోషంగా ఉండాలి

**శాసనసభ్యులు టి.ప్రకాష్ గౌడ్**

**లోక కల్యాణార్థమే జగన్నాథ రథయాత్ర**

రాజేంద్రనగర్,జులై05(నమస్తే ఉదయం) మైలార్ దేవ్ పల్లి డివిజన్లో హౌసింగ్ బోర్డ్ కాలనీలో పురవీధుల్లో శనివారం జగన్నాథ రథయాత్ర వైభవంగా సాగింది.రథయాత్రను ఎమ్మెల్యే టి.ప్రకాష్ గౌడ్ పూజలు నిర్వహించి లాంఛనంగా ప్రారంభించారు.ప్రత్యేకంగా అలంకరించిన రథంలో జగన్నాథ, బలరామ, సుభద్రాదేవి మూర్తులు,ముందు భాగంలో శ్రీప్రభుపాదుల విగ్రహాన్ని ఉంచి హారతి సమర్పించారు.రథయాత్ర ఊరేగింపు కన్నుల పండుగగా కొనసాగింది.పూరి జగన్నాథుని రథయాత్రను అందంగా అలంకరించి,భక్తి పాటలతో నృత్యాలు చేస్తూ కోలాటం ఆడుతూ ఆనందోత్సవాల నడుమ రథయాత్ర కొనసాగింది.ఈ సందర్భంగా రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి.ప్రకాష్ గౌడ్ మాట్లాడుతూ...జగన్నాథుడి ఆశీస్సులతో ప్రజలందరూ సంతోషంగా ఉండాలని ఆకాంక్షించారు.నేటి యువతరానికి ఈలాంటి కార్యక్రమాలు ఎంతో అవసరమని ఎమ్మెల్యే పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో డివిజన్ కాంగ్రెస్ పార్టీ నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.



## జగన్నాథ స్వామి ఆశీస్సులతో ప్రజల సుఖ సంతోషాలతో ఉండాలి

**రాజేంద్రనగర్ నియోజకవర్గం**
**బీజేపీ ఇంచార్జ్ తోకల శ్రీనివాస్ రెడ్డి**

రాజేంద్రనగర్,జులై05(నమస్తే ఉదయం) పూరి జగన్నాథుడి ఆశీస్సులతో ప్రజలందరూ సుఖ సంతోషాలతో ఉండాలని రాజేంద్రనగర్ నియోజకవర్గం బీజేపీ ఇంచార్జ్ తోకల శ్రీనివాస్ రెడ్డి అన్నారు.రాజేంద్రనగర్ నియోజకవర్గం పరిధిలోని మైలార్ దేవ్ పల్లి డివిజన్ పరిధిలోని హౌసింగ్ బోర్డ్ కాలనీలో పూరి జగన్నాథ్ రథయాత్ర పండుగను పురస్కరించుకొని పూరి జగన్నాథ్ ప్రత్యేక పూజ కార్యక్రమం,అన్నదానం కార్యక్రమంలో రాజేంద్రనగర్ నియోజకవర్గం ఇంచార్జ్,డివిజన్ కార్పొరేటర్ తోకల శ్రీనివాస్ రెడ్డి ఆలయ కమిటీ సభ్యులతో కలిసి ప్రత్యేక పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ...శ్రీపూరి జగన్నాథ్ స్వామి వారి ఆశీస్సులతో చల్లని దీవెనలతో ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో పాడి పంటలతో జీవితాంతం ఆనందంగా ఉండాలని ఆకాంక్షించారు.ఆ భగవంతుడి ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని కోరుకున్నారు.జగన్నాథుని ఆశీస్సులు దేశం అభివృద్ధిలో కొత్త శిఖరాలను అధిరోహించటానికి సహాయపడతాయని ఆశాభావం వ్యక్తం చేశారు.జగన్నాథుని ఆశీస్సులతో,మన దేశం వృద్ధిలో కొత్త శిఖరాలను అధిరోహించాలి.ప్రతి భారతీయుడు సంతోషంగా,సంపన్నంగా ఉండాలని కోరారు.ఈ కార్యక్రమంలో మాజీ డివిజన్ ప్రెసిడెంట్ అడికె జనార్ధన్,శ్రీకాంత్ రెడ్డి,శంకర్,జగన్నాథ్ ఉత్సవ కమిటీ మండలి సభ్యులు రాంబాయ్,సుశీల్, రాజు,ఉత్సవ కమిటీ సభ్యులు స్థానిక ఒరిస్సా ప్రజలు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# అట్టహాసంగా ఆర్యన్ స్కూల్లో వనమహోత్సవం

**పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ ఒక మొక్క నాటాలి. మహేందర్ రెడ్డి**



విద్యార్థుల చేత మొక్కలతో నిండిపోయిన పాఠశాల ఆవరణం.



విద్యార్థి చేత మొక్కలు స్వీకరిస్తున్న స్కూల్ చైర్మన్ మహేందర్ రెడ్డి, ప్రిన్సిపల్ సచిన్ జైస్వాల్



ర్యాలీగా బయలుదేరిన విద్యార్థులు




పర్యావరణ పరిరక్షణపై నృత్యం చేస్తున్న విద్యార్థులు



కాలనీలో స్థానికులకు మొక్కలు పంపిణీ చేస్తున్న ప్రిన్సిపాల్ జైస్వాల్ విద్యార్థులు

రాజేంద్రనగర్, జులై 5 ( నమస్తే ఉదయం) భావితరాల భవిష్యత్తుకు, పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరు ఒక మొక్కను నాటాల్సిన అవసరం ఎంతైనా ఉందని ప్రముఖ సంఘ సేవకులు ఆర్యన్ స్కూల్ చైర్మన్ మహేందర్ రెడ్డి పిలుపునిచ్చారు. మైలార్ దేవుపల్లి డివిజన్ పరిధిలోని ప్రగతి కాలనీ లో గల ఆర్యల్ స్కూల్లో శనివారం వన మహోత్సవ కార్యక్రమం ను అట్టహాసంగా నిర్వహించారు. పాఠశాలకు వచ్చే ప్రతి విద్యార్థి ఒక మొక్కతో పాఠశాలకు రావడంతో పాఠశాల ఆవరణ మొత్తం మొక్కలతో నిండిపోయింది. పాఠశాల ప్రిన్సిపల్ సచిన్ జైస్వాల్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన వనమోత్సవ కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ మహేందర్ రెడ్డి పాల్గొని విద్యార్థుల ఉద్దేశించి ప్రసంగించారు. నేటి బాలలే రేపటి పౌరులను చెందంగా... నేడు నాటిన చిన్న మొక్క భవిష్యత్ తరాలకు మహావృక్షంగా మారి పర్యావరణ సంరక్షణ కోసం ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు. పాఠశాలకు ప్రతి విద్యార్థి ఒక మొక్క తేవడం ఎంతో అభినందనీయమని అదేవిధంగా మీ ఇళ్ళ ముందు మీ తల్లిదండ్రుల చేత ఒక్కో మొక్క నాటించాలని విద్యార్థులకు సూచించారు. పాఠశాల ప్రిన్సిపల్ సచిన్ జైస్వాల్ మాట్లాడుతూ... పర్యావరణ కోసం మొక్కలు నాటడం వాటి ప్రాముఖ్యత విద్యార్థులకు వివరించారు. పాఠశాల ఆవరణలో ఉపాధ్యాయులు విద్యార్థులు మొక్కలు నాటారు. అనంతరం పాఠశాల నుంచి ర్యాలీగా బయలుదేరి మొక్కలు నాటడం వాటి ఆవశ్యకత గురించి ఇంటింటికి తిరిగి ప్రచారం చేశారు. ప్రతి ఒక్కరు ఒక మొక్క నాటాలి పర్యావరణాన్ని కాపాడాలని నినాదాలు చేస్తూ భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

# నియోజకవర్గం అభివృద్ధి లక్ష్యంగా ముందుకు వెళ్తున్నాం: ఎమ్మెల్యే టి.ప్రకాష్ గౌడ్

మణికొండ,జులై05(నమస్తే ఉదయం) రాజేంద్రనగర్ నియోజకవర్గంలో అన్ని సమస్యల పరిష్కారానికి కృషి చేయడం జరుగుతుందని ఎమ్మెల్యే టి.ప్రకాష్ గౌడ్ అన్నారు.ప్రతి మనిషికి మణికొండ మున్సిపాలిటీలో అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు,ప్రారంభోత్సవాలలో పాల్గొన్నారు.మణికొండ మున్సిపాలిటీ పరిధిలో పలు అభివృద్ధి పనులకు శనివారం ఎమ్మెల్యే టి.ప్రకాష్ గౌడ్ శంకుస్థాపనలు,ప్రారంభోత్సవాలు చేశారు.శివ నగర్ కమ్యూనిటీ హాల్ వార్డు నెం.18లో రూ.42 లక్షల వ్యయంతో నిర్మించిన శివనగర్ కమ్యూనిటీ హాల్ ప్రారంభోత్సవం చేశారు.అల్కాపూర్ లోని పార్క్-1 వార్డు నెం.9లో రూ.100 లక్షల రూపాయల అంచనా వ్యయంతో నిర్మించిన పార్క్-1ను సందర్శించారు.స్పెక్ట్రమ్ విల్లాస్ వద్ద బాక్స్ కల్వర్ట్ వార్డు నెంబర్ 7 లో రూ.75 లక్షల రూపాయల అంచనా వ్యయంతో నిర్మించిన బాక్స్ కల్వర్ట్ ప్రారంభోత్సవం,వెంకటేశ్వర కాలనీలో సీసీ రోడ్డు వార్డు నెంబర్ 4 లో రూ.50 లక్షల అంచనా వ్యయంతో



అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టిన ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్

నిర్మించనున్న సీసీ రోడ్డుకు ఉదయం శంకుస్థాపన,అలిజాపూర్ రోడ్డులో సెంట్రల్ మీడియన్ లో వార్డు నెంబర్ 6 లో రూ.50 లక్షల రూపాయల అంచనా వ్యయంతో నిర్మించనున్న సెంట్రల్ మీడియన్‌కు శంకుస్థాపన,తిరుమల హిల్స్ పార్క్ వార్డు నెంబర్ 17 లో రూ.60 లక్షల రూపాయల అంచనా వ్యయంతో నిర్మించిన తిరుమల హిల్స్ పార్క్ ప్రారంభోత్సవం,శివాజీ నగర్ కమ్యూనిటీ హాల్ వార్డు నెంబర్ 14 లో రూ.125 లక్షల అంచనా వ్యయంతో నిర్మించిన శివాజీ నగర్ కమ్యూనిటీ హాల్ ప్రారంభోత్సవం,జలమండలి కార్యాలయం సమీపంలో కమ్యూనిటీ హాల్ వార్డు నెంబర్ 13 లో రూ.275 లక్షల రూపాయల అంచనా వ్యయంతో నిర్మించిన కమ్యూనిటీ హాల్ ప్రారంభోత్సవం చేశారు.మొత్తం రూ.777 లక్షల రూపాయల విలువైన ఈ అభివృద్ధి పనులతో మణికొండ ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు అందుబాటులోకి రానున్నాయని ఎమ్మెల్యే తెలిపారు.నియోజకవర్గాన్ని ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతానని అన్నారు.నియోజకవర్గ పరిధిలోని సమస్యలను తన దృష్టికి తీసుకువస్తే పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటానన్నారు.ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా నెరవేరుస్తున్నానన్నారు.ఈ కార్యక్రమాలకు,స్థానిక నాయకులు అధికారులు ఉన్నారు.



బీసీ సంక్షేమ హాస్టల్లో విద్యార్థులకు పంపిణీ చేస్తున్న చెప్పులు పరిశీలిస్తున్న కలెక్టర్ సంతోష్

## బిసి సంక్షేమ గురుకుల పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్

గద్వాల జిల్లా ప్రతినిధి , జూలై5(నమస్తే ఉదయం)జిల్లా కేంద్రంలోని దౌదర్పల్లి, పరమాల వద్దగల జ్యోతిబాపూలే బిసి సంక్షేమ గురుకుల పాఠశాలను శనివారం జిల్లా కలెక్టర్ బిఎం సంతోష్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థులకు అందుతున్న విద్యా , మౌలిక సదుపాయాల పరిరక్షణపై ప్రత్యేక దృష్టితో ఈ తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా తరగతి గదుల్లో విద్యార్థులు చదువుతున్న తీరును పరిశీలించారు. అలాగే డార్మెటరీలు, టాయిలెట్లు, మధ్యాహ్న భోజనం తదితర వసతులపై ఆరా తీశారు. అవసరమైన అభివృద్ధి పనులపై అక్కడి సిబ్బందికి సూచనలు చేశారు. విద్యార్థులకు మంచి విద్యతోపాటు పౌష్టికాహారం అందించాలని సూచించారు. పరిసరాల పరిశుభ్రత తదితర అంశాలపై సమీక్ష జరిపారు. ఈ తనిఖీల నేపథ్యంలో, జిల్లా కలెక్టర్ విద్యార్థుల భద్రత, అభ్యాసం, మౌలిక వసతుల మెరుగుదల కోసం అధికారులు నిరంతరం నిఘా ఉంచాలని, అవసరమైన చర్యలు చేపడుతూ ఉండాలని సూచించారు. జిల్లా కలెక్టర్ విద్యార్థులతో ప్రత్యక్షంగా మాట్లాడి, వారు ఎదుర్కొంటున్న సమస్యలు, అవసరాలు, అభిప్రాయాలను స్వయంగా అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులతో ముఖాముఖిగా మాట్లాడుతూ, బాగా చదువుకుని ఉన్నత స్థానాలను అధిరోహించాలని సూచించారు. విద్యతోపాటు క్రీడలలో కూడా రాణించాలని సూచించారు. విద్యార్థులందరికీ యూనిఫారంతో పాటు పాఠ్య పుస్తకాలు అందేలా చూడాలని ఉపాధ్యాయులకు ఆదేశించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధాన ఉపాధ్యాయురాలు అలివేలు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## ప్రభుత్వం నాణ్యమైన విద్యపై దృష్టి సారించింది

గద్వాల జిల్లా ప్రతినిధి, జూలై5 (నమస్తే ఉదయం)ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు ఉత్తమమైన భవిష్యత్తు అందించేందుకు ప్రభుత్వం మౌలిక వసతులు,నాణ్యమైన విద్యా వాతావరణంపై దృష్టి సారించిందని జిల్లా కలెక్టర్ బి.యం. సంతోష్ తెలిపారు. శనివారం గద్వాల్ మండలంలోని దౌదార్‌పల్లి,పరుమాల సమీపంలో ఉన్న మహాత్మా జ్యోతిబా పూలే తెలంగాణ వెనుకబడిన తరగతుల సంక్షేమ వసతి బాలికల పాఠశాలలను ఆకస్మిక తనిఖీ నిర్వహించారు.ఈ సందర్భంగా కలెక్టర్ పాఠశాలలో ఎంతమంది విద్యార్థినిలు ఉన్నారు ?.. వారికి సరిపడా బెడ్స్ (మంచాలు), మరుగుదొడ్లు, స్నానపు గదులు ఉన్నాయా? లేదా ? అని ప్రిన్సిపల్ ను అడిగి తెలుసుకున్నారు. అదేవిధంగా విద్యార్థులు ఏ విధంగా చదువుతున్నారు ఫలితాలు ఎలా వస్తున్నాయి అనే విషయాలు అడిగి తెలుసుకున్నారు.విద్యార్థినిలు నిద్రించే గదుల్లోకి వెళ్ళి బెడ్స్, ఆహార పదార్థాలు,వంట గదులు, మరుగుదొడ్లు, పాఠ్య పుస్తకాలు, తరగతి గదులను పరిశీలించారు. విద్యార్థులకు అన్ని రకాల మౌలిక సదుపాయాలు కల్పించాలని,అట్టి విషయంలో ఏమైనా ఇబ్బందులు ఉంటే తెలియజేయాలని ప్రిన్సిపాల్ కి సూచించారు.విద్యార్థులు అన్ని క్రీడల్లో పాల్గొని ప్రతిభను అభివృద్ధి చేసుకునేలా ప్రోత్సహించాలని అన్నారు.ఇందుకోసం పాఠశాలలో నాణ్యమైన క్రీడాసామగ్రి, అవసరమైన సౌకర్యాలు,అన్ని క్రీడలకు అనుకూలమైన మైదాన వాతావరణం ఉండేలా చూడాలని సూచించారు.ప్రతి విద్యార్థి తప్పకుండా యూనిఫాం ధరించాలని తెలిపారు.అన్ని పుస్తకాలు ప్రతి విద్యార్థికి సమంగా అందేలా పంపిణీ చేయాలని సూచించారు.హాస్టల్లో డైట్ ప్లాన్ అమలును పరిశీలించి, విద్యార్థులకు నాణ్యమైన భోజనం ఇవ్వాలన్నారు.విద్యార్థులు ఆత్మవిశ్వాసంతో బాగా చదివి, మంచి స్థాయికి ఎదిగి,తాము చదువుకున్న పాఠశాలలు, కళాశాలలకు గౌరవం తీసుకురావడమే కాకుండా,తమ భవిష్యత్తు కోసం సహకరిస్తున్న ప్రభుత్వానికి కూడా మంచి పేరు తీసుకురావాలని అన్నారు.ఈ కార్యక్రమంలో పాఠశాలల ప్రధానోపాధ్యాయులు అలివేలు, అనీల,పాఠశాల సిబ్బంది, విద్యార్థినిలు, తదితరులు పాల్గొన్నారు.



సీసీ రోడ్డు పనులను పరిశీలిస్తున్న అత్తాపూర్ డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షులు ప్రవీణ్ రెడ్డి

## ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ నేతృత్వంలో అభివృద్ధి పరుస్తాం

**అత్తాపూర్ డివిజన్ అభివృద్ధికి కృషి..**

**అత్తాపూర్ డివిజన్ ప్రెసిడెంట్ గొంది ప్రవీణ్ రెడ్డి**


రాజేంద్రనగర్,జులై05(నమస్తే ఉదయం) ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ నేతృత్వంలో రాజేంద్రనగర్ నియోజకవర్గంను అన్ని విధాలా అభివృద్ధి చేసేందుకు కృషి చేయడం జరుగుతుందని అత్తాపూర్ డివిజన్ ప్రెసిడెంట్ గొంది ప్రవీణ్ రెడ్డి అన్నారు.ఎమ్మెల్యే టి.ప్రకాష్ గౌడ్ చొరవతో అత్తాపూర్ డివిజన్లోని తేజస్వినగర్లో మెమొరీ చర్చ్ వెళ్లే దారిలో ప్రవీణ్ రెడ్డి ఆధ్వర్యంలో సీసీ రోడ్లు వేయడం జరిగినది.ప్రణాళికబద్ధంగా కాలనీవాసుల సమస్యలు పరిష్కారం చేస్తామని తెలిపారు.ఎమ్మెల్యే టి.ప్రకాష్ గౌడ్ చొరవతోనే డివిజన్ అభివృద్ధి చెందుతుందనిహొెల్లడించారు.అయితే ఇంతకుముందు ఎప్పుడు కూడా కాలనీ అభివృద్ధిని ఇతరులు ఎవరూ పట్టించుకున్న దాఖలాలు లేవని, ఎమ్మెల్యే గెలిచిన తర్వాతే కాలనీ అన్ని విధాలుగా అభివృద్ధి చెందుతున్నదని వెల్లడించారు.ఈ కార్యక్రమంలో జిహెచ్ఎంసి ఆఫీసర్స్ నాగేందర్ గౌడ్,ఈఈ,రాజేష్ ఏఈ,రాజేంద్రనగర్ మండల్ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు సుంకుశాల మహేష్,కాంగ్రెస్ సీనియర్ నాయకుడు ఎస్.రవీందర్ కుమార్,ఎస్సీ సెల్ ప్రెసిడెంట్ పుప్పాల కృష్ణమూర్తి,వర్కింగ్ ప్రెసిడెంట్ సులిగే మహేందర్,రాజు,రత్నం,కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.




## మాన్యం.. బేరం?

**మాన్యం భూమి విక్రయాలను నిలిపివేయాలని కోరిన గ్రామస్తులు**

గద్వాల ప్రతినిధి, జూలై5(నమస్తే ఉదయం) గట్టు మండల పరిధిలోని ఇందువాసిలోగల శ్రీఇంజమ్మ అవ్వ ఆలయ మాన్యం భూమిని కొందరు అమ్మకానికి పెట్టారు. ఆ భూమి తమదేనని శనివారం ఇతరుల పేరు మీద రిజిస్ట్రేషన్ చేయడానికి మీ సేవ సెంటర్ లో స్లాట్ బుక్ చేయడానికి వెళ్లగా విషయం తెలుసుకున్న గ్రామస్తులు రిజిస్ట్రేషన్ నిలిపివేయాలంటూ తహసీల్దార్ కోరడంతో తాత్కాలికంగా నిలిపివేశారు. గట్టు తహసీల్దార్ కార్యాలయంలో మాన్యం భూములు కాపాడాలంటూ వినతిపత్రం అందజేశారు. గ్రామస్తులు కథనం మేరకు..గట్టు మండలం ఇందువాసి గ్రామంలో వెలసిన శ్రీ ఇంజమ్మ అవ్వ దేవర ఉత్సవాలు ప్రతి ఏటా ఘనంగా నిర్వహిస్తారు. రాజుల కాలంలో దేవలాయాల కోసం సర్వే నంబర్ 775లో 16.03 ఎకరాలు శ్రీ ఇంజమ్మ అవ్వ దేవాలయానికి దారదతం చేశారు. ఆనాటి నుంచి ఆలయ నిర్వాహకులు ఆలయంలో పూజలు చేసి, భూములను సాగు చేసుకునే వారు. అమ్మవారి సన్నిధిలో అమ్మ వారి కోసం అని డైక్లాట్‌లో పొందుపరిచిన సర్వే నంబరు 775లోని 16.03 ఎకరాలకు ఎసరు పెట్టారు. గట్టు తహసీల్దార్ కార్యాలయంలో నిషేధిత భూముల జాబితాలో ఉన్నా, అగ్రిమెంట్ల ద్వారా అమ్మేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని స్థానికులు అంటున్నారు. కాగ శ్రీఇంజమ్మ అవ్వ ఆలయ నిర్వాహకులలో ఒకరైన ఇంజమ్మ తిమ్మయ్య పేరు మీద ఉన్న మాన్యం భూములు ఆమె మరణాంతరం కుమారులకు వారసత్వంగా మారింది. దీంతో అమ్మ వారి భూమి విలువ ఎకరం రూ.పది లక్షలు పలుకుతోంది. దీనిలో కొంత భూమిని అమ్మేందుకు ప్రయత్నాలు చేసినట్లు తెలిసింది. అది శ్రీఇంజమ్మ అవ్వ మాన్యం అని తెలిసిందని గట్టు డీటి విజయ్ కుమార్ ఈ సందర్భంగా తెలిపారు. ఆ భూమి క్రయ, విక్రయాలు చెల్లుబాటు కావని స్పష్టం చేశారు. ఆ భూమిని సోమవారం పరిశీలిస్తామని, అన్యాక్రాంతం కాకుండా చూస్తామని అన్నారు.



మణికొండ విద్యార్థి విభాగం అధ్యక్షుడుగా వీరమల్ల అజయ్ కుమార్ ను సన్మానిస్తున్న నాయకులు

## మణికొండ విద్యార్థి విభాగం అధ్యక్షుడుగా వీరమల్ల అజయ్ కుమార్

మణికొండ,జులై05(నమస్తే ఉదయం) భారత రాష్ట్ర సమితి ఆధ్వర్యంలో ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేయడం జరుగుతుందని మణికొండ మున్సిపల్ పార్టీ అధ్యక్షులు సీతారాం ధూళిపాళ అన్నారు.భారత రాష్ట్ర సమితి విద్యార్థి విభాగం తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ముఖేష్,రాజేంద్రనగర్ అధ్యక్షుడు గౌతమ్,మణికొండ పార్టీ అధ్యక్షుడు సీతారాం ధూళిపాళ,బీఆర్ఎస్ స్థానిక పార్టీ నాయకులు కలసికట్టుగా మణికొండ విద్యార్థి విభాగం (బిఆర్ఎస్వీ) కమిటీని నియమించారు.అందులో భాగంగా మణికొండ విద్యార్థి విభాగం అధ్యక్షుడుగా వీరమల్ల అజయ్ కుమార్,వర్కింగ్ ప్రెసిడెంట్ గా సంగం శశాంక్,ప్రధాన కార్యదర్శిగా గుట్టమీది సాయితేజ,ఉపాధ్యక్షునిగా డి.ఆదర్శ్,కార్యదర్శిగా కరుణాకర్,ఆర్గనైజింగ్ కార్యదర్శిగా ధనరాజ్,కార్యవర్గ సభ్యులుగా శ్రీకర్,అరుణ్, అనిల్,గణేష్,సంతోష్,మనోజ్ లకు నియామక పత్రాలు అందజేశారు.ఈ సందర్భంగా సీతారాం ధూళిపాళ మాట్లాడుతూ...బీఆర్ఎస్వీ ఆధ్వర్యంలో పేద విద్యార్థులకు అండగా ఉంటామన్నారు.ప్రజలు ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కొన్నా తమ దృష్టికి తీసుకువస్తే పరిష్కరించడం జరుగుతుందన్నారు.నూతన కమిటీ ఆధ్వర్యంలో విద్యార్థులకు అండగా ఉండటం జరుగుతుందని తెలిపారు.

## భూ వివాదంలో ఇరువర్గాల మధ్య ఘర్షణ

గద్వాల జిల్లా ప్రతినిధి, జూలై5(నమస్తే ఉదయం)భూ వివాదంలో ఇరువర్గాల మధ్య ఘర్షణ జరిగింది. ఈ ఘటన కేటిదొడ్డి మండలంలో శనివారం చోటు చేసుకుంది. కేటిదొడ్డి పోలీసులు, గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం. కేటిదొడ్డి మండ లంలోని కొండాపురం గ్రామ రెవెన్యూలో సర్వేనెంబరు 106కి సంబంధించిన భూమి విషయమై గ్రామానికి చెందిన భీములమ్మ ఆమె సోదరులైన వడ్డే పెద్దిరాజు, చిన్నరాజుల మధ్య కొంత కాలంగా వివాదం నడుస్తోంది. ఈ క్రమంలో శనివారం పొలం వద్ద భీములమ్మ తో వడ్డేపెద్దిరాజు, చిన్న రాజు, నరసింహులు గొడవ పడ్డి, భీములమ్మపై దాడి చేశారు. భీములమ్మ కుమారుడు చింతలకుంట మల్లయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ బి.శ్రీనివాసులు తెలిపారు.

# విద్యార్థుల విజయమే ఉద్యాన విశ్వవిద్యాలయం విజయం

**చీఫ్ పర్సనల్ ఆఫీసర్ సౌత్ సెంట్రల్ రైల్వే ఎస్ రమణారెడ్డి**

రాజేంద్రనగర్,జులై05(నమస్తే ఉదయం) విద్యార్థుల విజయమే ఉద్యాన విశ్వవిద్యాలయం విజయమని చీఫ్ పర్సనల్ ఆఫీసర్ సౌత్ సెంట్రల్ రైల్వే ఎస్ రమణారెడ్డి అన్నారు.శ్రీ కొండా లక్ష్మణ్ తెలంగాణ ఉద్యాన విశ్వవిద్యాలయం పరిధిలోని రాజేంద్రనగర్ ఉద్యాన కళాశాలలో కాలేజ్ యాన్యువల్ డే ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా జ్యోతి ప్రజ్వలనతో ఈ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...కెరియర్ను ముందుగా ఎంచుకోవాలని,దానికనుగుణంగా కృషి చేయాలని పేర్కొన్నారు.విద్యార్థులు చదువుతోపాటు అన్ని విభాగాలలో నిష్ణాతులవ్వాలని వివరించారు.ముఖ్యంగా సమయాన్ని సద్వినియోగం చేసుకుంటూ ఒక్కో అవకాశాన్ని అందిపుచ్చుకుంటూ ముందడుగు వేయాలని తెలిపారు.ప్రధానంగా మనకు మనమే ప్రోత్సహించుకుంటూ ప్రోత్సహించుకుంటూ ముందడుగు వేయాలని వివరించారు.ఉద్యాన విశ్వవిద్యాలయ డీన్ ఆఫ్ హార్టికల్చర్,డీన్ ఆఫ్ స్టూడెంట్ అఫైర్స్ డాక్టర్ జె చీనా విద్యార్థుల ఉద్దేశించి మాట్లాడుతూ..సరైన ప్రణాళికలతో,నిరంతర కృషితో ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చు అని తెలిపారు.ముఖ్యంగా విద్యార్థుల విజయమే విశ్వవిద్యాలయం విజయంగా పేర్కొనవచ్చు అని



తెలిపారు.అదేవిధంగా విద్యార్థులు సొంత ప్రణాళికలు,సరైన సమయపాలన తో ముందడుగు వేయాలని పేర్కొన్నారు.ముఖ్యంగా పర్సనాలిటీ డెవలప్మెంట్ ను పెంపొందించుకోవాలని,అనునిత్యం సరైన సాధనతో కృషి చేస్తే జీవితంలో అనుకున్నది సాధించవచ్చు అని వివరించారు.ముఖ్యంగా విద్యార్థుల అభివృద్ధికి విశ్వవిద్యాలయం ఎల్లవేళలా తోడ్పడుతుందని వారికి అవసరమైన అన్ని సౌకర్యాలను కల్పిస్తుందని పేర్కొన్నారు.ప్రధానంగా విద్యార్థులు భవిష్యత్తులో జూనియర్ రీసెర్చ్ ఫెలోషిప్,సీనియర్ రీసెర్చ్ ఫెలోషిప్,సివిల్స్,గ్రూప్స్,బ్యాంక్స్ తదితర ఉద్యోగాలకు అవసరైన శిక్షణా కార్యక్రమాన్ని ఆన్లైన్ మరియు ఆఫ్లైన్లలో త్వరలో ప్రారంభిస్తామని తెలిపారు.విద్యార్థుల మంచి భవిష్యత్తు కోసం విశ్వవిద్యాలయం అహర్నిశలు పాటుపడుతుందని వారి ఉన్నతని ఎల్లవేళలా కాంక్షించే విశ్వవిద్యాలయ అధికారులు ఉన్నారని తెలిపారు.ముఖ్యంగా మీ విజయం మిమ్మల్ని గుర్తింపునిస్తుందని




తెలిపారు.కళాశాల దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు వివిధ ఆటలు,సాంస్కృతిక, లిటరరీ విభాగాలలో పోటీలను నిర్వహించారు.ఈ కార్యక్రమంలో విజేతలు అయిన విద్యార్థిని విద్యార్థులకు మెడల్స్ బహుమతులు,ప్రశంసా పత్రాలను అందజేశారు.ఆ తర్వాత విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు.ఈ కార్యక్రమంలో జె. శంకరయ్య,డీన్ ఆఫ్ హార్టికల్చర్ డీన్ ఆఫ్ స్టూడెంట్ అఫైర్స్ డాక్టర్ జే చీనా,కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ పి.ప్రశాంత్, ఎస్.రమణారెడ్డి, ఐఆర్పిఎస్ చీఫ్ పర్సనల్ ఆఫీసర్ సౌత్ సెంట్రల్ రైల్వే శంకరయ్య,డాక్టర్ కళాధర్ బాబు,అశ్విన్ కుమార్,డాక్టర్ శ్రీనివాస్,డాక్టర్ నాగ హర్షిత,సిఎన్ఆర్ సంతోషిని,మానస,మమత,లావణ్య,డాక్టర్ జెన్నీ,అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ దీపారాణి,అనిల్ రెడ్డి,శ్రీరాములు,ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ శ్రీధర్ రెడ్డి,శ్రీనాథ్, వేణుగోపాల్, రామకృష్ణ, రజిత,అశోక్, పూజ,కృష్ణవేణి, బోధన,బోధనేతర సిబ్బంది విద్యార్థులు పాల్గొన్నారు.